క్లుప్తంగా

రైల్వే హాస్పటల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా సంధ్యారాణి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ప్రధాన రైల్వే హాస్పటల్లో చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా హెలెన్ సంధ్యారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం డివిజనల్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్ ఆమెను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలెన్ సంధ్యారాణి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తించేవారని తెలిపారు. ఉద్యోగులకు, పెన్షనర్‌లకు ఎన్నో సేవలు అందించడంతో పాటు రోగులకు అవసరమైన సహాయ, సహకారాలు పూర్తిగా అందించేవారని పేర్కొన్నారు. కార్మిక సంఘం డివిజనల్ కార్యదర్శి పి.శ్రీనివాసచార్యులు, మహిళా కార్యదర్శి శ్రీదేవి, లోకో రన్నింగ్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి తరుణ్ తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):పేద విద్యార్థి ఇంటర్ చదువుకునేందుకు దీవెన ఫౌండేషన్ రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందచేసింది. కేఎల్‌రావునగర్‌కు చెందిన గొంగటి సుదర్శన రావు కుమార్తె సంధ్య పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ చదువుకునే స్థోమత లేకపోవడంతో దీవెన ఫౌండేషన్ సాయాన్ని కోరింది. దీంతో ఫౌండేషన్ సభ్యులు కొత్తపేట ఎస్ఐ షబ్బీర్, ఏఎస్ఐ బాబాజీ, కానిస్టేబుల్ గోపరాజు చేతుల మీదగా రూ. 10 వేల సాయాన్ని అందించారు. పేద వారికి సహాయం అందించడంలో ఫౌండేషన్ ఎల్లప్పుడు ముందుంటుందని వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు పేర్కొన్నారు. దాతల సాయంతో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో మంచి స్థాయికి చేరుకోవడంతో పాటు మరి కొంత మందికి సాయం అందించాలని కోరారు.

మానసిక వికలాంగులకు సేవలు అభినందనీయం



భవానీపురం(విజయవాడపశ్చిమ):మానసిక వికలాంగులకు సేవలు అందించటం సామాన్యమైన విషయం కాదని, వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు అభినందనీయులని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు తెలిపారు. విద్యాధరపురం ఆర్కే పబ్లిక్ స్కూల్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పటం అంటేనే ఎంతో కష్టమని, అటువంటిది మానసికంగా బలహీనంగా ఉండే పిల్లలకు శిక్షణ ఇవ్వటంతోపాటు వైద్య సేవలను అందించటం ఎంతో ఓర్పుతోకూడినదని తెలిపారు. సంస్థ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ జె సునీత, జె ప్రసాద్ మాట్లాడుతూ మానసిక వికలాంగులకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్‌లో స్పీచ్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ వంటి పలు సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సేవల వివరాల కోసం 9985951397 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణాలు పూర్తి చేయండి

జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇటీవల తిరుపతిలో జరిగిన ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా మరో పది రోజుల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలో నియోజకవర్గాల వారీగా సంస్థాగత నిర్మాణాలు పూర్తి చేయాలని సంఘం జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పార్టీ శ్రేణులకు సూచించారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా సంస్థాగత నిర్మాణాలు పూర్తి చేసుకుని జూలై నెలలో హైదరాబాద్‌లో జరిగే జాతీయ సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలని కోరారు. చినసుబ్బారావు, ఎం.వెంకటేశ్వరరావు, వై.కోటేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన పేదల సొంతింటి కల



జెండా ఊపి బస్సులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కలెక్టర్ ఢిల్లీరావు, మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



నిడమర్రులో పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శాసన రాజధాని గ్రామం నిడమర్రులో పేదలకు మంజూరయిన ఇళ్ల స్థలాల పట్టాలను అందుకునేందుకు గురువారం బస్సుల్లో బయలుదేరారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి 2,400 మంది లబ్ధిదారులతో కూడిన బస్సులను స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సొంత ఇల్లు లేకుండా ఏ ఒక్క పేదవాడు ఉండకూడదని ఎన్నికలకు ముందు ఇచ్చిన నవరత్నాల హామీల్లో భాగంగా రాజధాని ప్రాంతంలో సొంత ఇంటి కల నెరవేర్చారని తెలిపారు. వచ్చే నెల 8వ తేదీన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి రోజున లబ్ధిదారులు గృహ నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు చేపట్టారని తెలిపారు.

క్షేత్రస్థాయిలోనే పట్టాల పంపిణీ....

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ సొంత ఇంటి కోసం కలలు కన్న పేదవారి కోసం ప్రారంభించిన జగనన్న కాలనీల్లో మరో ముందడుగు పడిందన్నారు. మున్నెన్నడూ లేని విధంగా లబ్ధిదారులు తాము నిర్మించుకోబోయే స్థలంలోనే పట్టాలు అందచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి వారికి కేటాయించిన ప్రాంతానికి తీసుకువెళుతున్నామని తెలిపారు. నగరానికి చెందిన 27,031 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా వారికి ఇప్పటికే సెంట్రల్, తూర్పు నియోజకవర్గాలకు చెందిన పేదలకు క్షేత్రస్థాయిలోనే పట్టాలను పంపిణీ చేశామన్నారు. పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 3,254 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా వారికి కూడా క్షేత్రస్థాయిలోనే పట్టాలు అందచేయనున్నట్లు చెప్పారు.

గృహ నిర్మాణాలకు సహాయ సహకారాలు....

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇటువంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో తమను కూడా భాగస్వాములుగా చేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్ల వద్దే సంబంధిత శాఖల అధికారులు జియో ట్యాగింగ్ చేసి పట్టాలను అందిస్తారని తెలిపారు. అక్కడ గృహనిర్మాణాలు పూర్తయ్యే వరకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ రెవెన్యూ, నగరపాలక సంస్థ, గృహ నిర్మాణ శాఖ అధికారులు వెన్నంటే ఉండి ఇంటి నిర్మాణం చేపట్టడానికి అవసరమైన సూచనలు, సలహాలు, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందేందుకు అవసరమైన విధి విధానాలు తెలియచేస్తారని వివరించారు.

పశ్చిమంలో స్టేడియం అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురంలో ఇన్‌డోర్, అవుట్‌డోర్ గేమ్స్‌కు సంబంధించి స్టేడియం అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక 45వ డివిజన్‌లోగల బాలాజీనగర్‌లో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్లను ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్యతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైౖ రోడ్లు అధ్వానంగా ఉండటంతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి కార్పొరేషన్ నిధులు మంజూరు చేయించి రోడ్లు, డ్రెయిన్లు పూర్తి చేశామని తెలిపారు. డివిజన్‌లో మట్టి రోడ్డు అనేది లేకుండా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే కొండ ప్రాంతంలోనూ తాగునీరు, మెట్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం...

గొల్లపూడి బైపాస్ రోడ్డు పక్కనే సుమారు 10 ఎకరాల కార్మిక శాఖకు చెందిన స్థలాన్ని 2009లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు స్పోర్ట్స్ అథారిటీ సంస్థకు బదలాయించామని వెలంపల్లి గుర్తు చేశారు. ఇప్పుడు ఆ స్థలంలో రూ.15 కోట్లతో అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. తొలి విడతగా రూ.7 కోట్లు, ఆ తరువాత రూ.8 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. వారం రోజుల్లో ఇక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని, అలాగే పిల్లల కోసం అవుట్‌డోర్ గేమ్స్ ఏర్పాటుకు టెండర్లుకూడా అయిపోయాయి కాబట్టి పనులు త్వరలో ప్రారంభిస్తామని వివరించారు. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో అధునాతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని చెప్పారు. అయితే ఈ స్టేడియం స్థలాన్ని కొన్ని రాజకీయ పార్టీలు కబ్జా చేసేందుకు యత్నించగా తాము అడ్డుకున్నామన్నారు. ఇక్కడున్న వీఎం రంగా సర్కిల్‌లో వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్‌లో ఆమోదంకూడా పొందిందన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం ఈ బాలాజీనగర్ మురికి కూపంలా ఉండేదని, జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలకే పరిమితం అయ్యేవారని, ఇప్పుడు తాము శంకుస్థాపనలు చేయటమే కాకుండా అవి పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా చేస్తున్నామన్నారు. అది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఘనత మాత్రమేనని స్పష్టం చేశారు. కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, ముత్తావాసు, ముత్యాల రాంబాబు, బైపినేని కోటేశ్వరరావు, బోర మల్లేశ్వరరెడ్డి, పీతల నాగు, నల్లం వాసు, గంగవరపు మురళి, దుర్వేసుల హుస్సేన్, డీ రాము తదితరులు పాల్గొన్నారు.



రోడ్ల నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, మాధురి లావణ్య

కెనాల్ బండ్‌లో చెట్లను ట్రిమ్మింగ్ చేయాలి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమీక్షా సమావేశంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ):మిషన్ క్లీన్ కృష్ణా-గోదావరి (ఎమ్‌సీకెజీసీ)లో భాగంగా నగరంలోని మూడు కాలువల ప్రక్షాళనకు నగరపాలక సంస్థ పనులను ప్రారంభించిందని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. విజయవాడ హనుమాన్‌పేట వెహికల్ డిపో వెనుక భాగంలోగల కెనాల్ బండ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. కెనాల్ బండ్‌లో పెరిగిన చెట్లను ట్రిమ్మింగ్ చేయాలని, అలాగే అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం వెహికల్ డిపో ప్రాంతంలోని మూడు కాలువల ప్రక్షాళన కోసం చేపట్టిన పనుల పురోగతిపై యన ఇంజినీరింగ్, హార్టికల్చర్, శానిటేషన్ డిపార్ట్‌మెంట్‌ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాలువల ప్రక్షాళన కోసం మూడు కాలువలకు ముగ్గురు ఎఎంఓహెచ్ స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించటంతోపాటు ఒక్కో కాలువను శుభ్రపరచేందుకు 200 మంది పారిశుద్ధ్య కార్మికులను కేటాయించామని చెప్పారు. వారి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. అనంతరం ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల పని తీరు, పురోగతి, ప్రజల్లో వాటిపై అవగాహన కల్పించేందుకు ఇంటి ఇంటి ప్రచారం చేయాలని కోరారు. యూజర్ చార్జీల వసూళ్లను మెరుగుపరచేందుకు ప్రత్యేక డ్రైవ్‌లను చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎస్ఈ నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నారాయణమూర్తి, వెంకటేశ్వరరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

భక్తులకు తక్షణ వైద్య సేవలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్య వచ్చినా వారికి తక్షణం వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులను అందించాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. మహా మండపం 7వ అంతస్తులోని దేవస్థాన ఆరోగ్య కేంద్రాన్ని గురువారం చైర్మన్ రాంబాబు పరిశీలించారు. డ్యూటీ డాక్టర్ ఏ సమయం వరకు విధులలో ఉంటారు... ఆరోగ్య కేంద్రంలో మందులు, ఇతర పరికరాలను పరిశీలించారు. వైద్య సహాయం కోసం వచ్చిన వారికి తక్షణమే సేవలు అందించేలా సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు విశ్రాంతి తీసుకునే సివి.రెడ్డి చారిటీస్‌లో కూడా ఉచిత వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వైద్య సేవలు అందుకున్న పలువురు భక్తులకు ఆయన మందులు పంపిణీ చేశారు.



భక్తులకు మందులు పంపిణీ చేస్తున్న చైర్మన్ కర్నాటి రాంబాబు

గౌహతిలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పరిశీలన



గౌహతిలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ల బృందం

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఈశాన్య రాష్ట్రాల విజ్ఞాన యాత్రలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ నేతృత్వంలో కార్పొరేటర్ల బృందం గురువారం గౌహతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు అందించే మంచినీటిని శుద్ధి చేసే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించింది. సుమారు 20 లక్షల జనాభా కలిగిన గౌహతి నగరంలో 45 ఎంఎల్‌డీ ప్లాంట్‌ల ద్వారా అందుబాటులో ఉన్న బ్రహ్మపుత్ర నది నుంచి రావాటర్‌ను తీసుకుని, వాటిని శుద్ధి చేసి ప్రతి రోజూ రెండు గంటల పాటు ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేస్తామని అక్కడి అధికారులు కార్పొరేటర్ల బృందానికి వివరించారు. రెండు వేర్వేరు ప్రదేశాల్లో 22.5 ఎంఎల్‌డీ చొప్పున ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల ద్వారా నీటిని శుద్ధి చేస్తామని, అదే విధంగా కొత్తగా 70 ఎంఎల్‌డీ ప్లాంట్ వాటర్ బోర్డ్ ద్వారా నిర్మాణంలో ఉందని తెలియ చేశారు. కాగా నగరంలో మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ విధానాలను కూడా కార్పొరేటర్ల బృందం పరిశీలించింది. కార్యక్రమంలో గౌహతి మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ హేమంత్ కుమార్ కలిట, అసిస్టెంట్ టెక్నికల్ ఇంజనీర్ సబీనా పాల్గొన్నారు.

నాణ్యతగా స్మృతివనం పనులు

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ):అంబేద్కర్ స్మృతివనం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. స్వరాజ్యమైదానంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్‌పాత్, లేండ్‌స్కేప్, కాంపౌండ్‌వాల్ నిర్మాణాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహానికి సంబంధించిన అన్ని భాగాలను కలిపి అత్యంత జాగ్రత్తగా నిర్మాణం చేయాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో జరిగే పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి కేటాయించిన పనులను ఉదయానికల్లా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆయా పనులను పరిశీలించేందుకు వస్తానని చెప్పారు. ఇది ఒక అద్భుతమైన ప్రాజెక్ట్ అని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా అంబేద్కర్ విగ్రహ నిర్మాణం జరగాలని సూచించారు. ప్రధాన విగ్రహంతోపాటు మిగిలిన పనులు సైతం సకాలంలో పూర్తి చేయాలని కోరారు.

శ్రీ కృష్ణ భగవానుడి బోధనలు అవసరం

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పూర్ణాహుతిలో పాల్గొన్న మల్లాది విష్ణు, హజరత్తయ్యగుప్తా తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):లోకానికి జ్ఞానాన్ని పంచిన గీతాచార్యుడు శ్రీ కృష్ణ భగవానుడి బోధనలు నేటి సమాజానికి అవసరమని ఏపీ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కొత్తపేటలోని శ్రీ కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న శ్రీ కృష్ణ నామ కోటి జపయజ్ఞము గురువారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన పూర్ణాహుతి ఇతర ప్రత్యేక వైది కార్యక్రమాల్లో మల్లాది విష్ణు పాల్గొన్నారు. తొలుత ఆయన స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురుషోత్తముడు, స్థితప్రజ్ఞుడైన శ్రీ కృష్ణుడు విష్ణుమూర్తి మహోన్నతావతారమని చెప్పారు. దశావతారాలలో శ్రీకృష్ణావతారం పరిపూర్ణమైనదిగా పేర్కొన్నారు. శ్రీ కృష్ణ భగవానుని నామాన్ని నిత్యం స్మరించే వారికి పదివేల యజ్ఞాలు, కోటి తీర్థాల పుణ్యస్నానాల ఫలితం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. పాప రూపాగ్నిలో దహనమై, చేసిన సత్కర్మలన్నీ శూన్యమైన వారికి కృష్ణనామం పరమ ఔషధం వంటిదన్నారు. అలాగే శ్రీకృష్ణుడి జీవితం ఒక ధర్మశాస్త్రమని, సమస్త మానవాళిని సన్మార్గంలో నడిపే విధంగా ఆ పరమాత్ముడు అర్జునునికి గీతను బోధించాడని వివరించారు. కృష్ణతత్వం చదివిన వారికి నిజమైన ప్రేమ తత్వం తెలుస్తుందన్నారు. గీతాసారాన్ని మనసున నింపుకోగలిగితే జీవితం సంతోషమయం అవుతుందని పేర్కొన్నారు. శ్రీ కృష్ణ పరమాత్ముని కృపా కటాక్షాలు నగర ప్రజలపైన, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపైన ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. సభకు అధ్యక్షత వహించిన బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ సుమారు ఎనిమిది కోట్ల శ్రీకృష్ణజపం జరిగిందన్నారు. ఎక్కడ భగవంతుని నామ జపం జరుగుతుందో అక్కడ సాక్షాత్ స్వామి ఉంటారన్నారు. వారం రోజుల పాటు కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. పీఠాధిపతి శ్రీ త్రిదండి వామన మహారాజ్ స్వామి అనుగ్రభాషణ చేశారు. కార్యక్రమాన్ని నంబూరి శ్రీహరి, కొల్లిపర మల్లేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, తేలప్రోలు వీరయ్య గుప్తా, ప్రసాద్, శివరాజ్ నిర్వహించారు

రక్తదానం ప్రాణదానంతో సమానం



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు, ఏడీ బాబూరావు

గన్నవరం రూరల్:రక్తదానం ప్రాణదానంతో సమానమని, రోగుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు తెలిపారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీసాక్స్) ఆధ్వర్యాన రాష్ట్రంలోని బ్లడ్ సెంటర్‌లలో పని చేస్తున్న 43 ప్రభుత్వ సెంటర్‌ల స్టాఫ్ నర్సులకు మూడు రోజుల పాటు జరిగే బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజన్ సర్వీసెస్‌పై గురువారం అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఏపీసాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ జె.నివాస్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సదస్సులో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాస్మిన్ సుల్తానా మొదటి రోజు స్టాఫ్ నర్సులకు బ్లడ్ డొనేషన్ సెంటర్‌లలో తీసుకోవాల్సిన చర్యలపై మార్గ నిర్దేశం చేశారు. దాతలకు కౌన్సెలింగ్ ఇవ్వటం, బ్లడ్ దానం చేసేటప్పుడు వారితో ప్రవర్తించే వాతావరణం, దాతలను బ్లడ్ ఇవ్వడానికి ప్రోత్సహించటం తదితర అంశాలను చర్చించారు. ఏపీసాక్స్ ఆధ్వర్యంలో కళాశాల పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ డిపార్టుమెంట్‌లు సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, డిపార్టుమెంట్ ఆఫ్ పాథాలజీ హెచ్‌వోడీ ప్రొఫెసర్ డి.నవీన్ చంద్రరావు, ప్రొఫెసర్ వి.కళ్యాణ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణీత్, బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజన్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ వి.బాబూరావు, స్టాఫ్ జి.రజినికుమారి, ఎస్.అశోక చక్రవర్తి పాల్గొన్నారు.

నేడు సివిల్ ర్యాంకర్స్‌కు అభినందన సభ



కృష్ణలంక(విజయవాడతూర్పు):అఖిల భారత సివిల్ సర్వీసెస్ (యూపీఎస్సీ) పరీక్షలలో ర్యాంకుల సాధించిన తెలుగు తేజాలకు శుక్రవారం ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో అభినందన సభ నిర్వహిస్తున్నామని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అభినందన సభకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ 36 ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అభినందన సభలో తెలుగు విద్యాకుసుమాలైన వీరగంధం లక్ష్మీ సుజాత (311వ ర్యాంకు), బొల్లిపల్లి వినూత్న (462వ ర్యాంకు), బొడ్డు హేమంత్ (469 ర్యాంకు), రేపూడి నవీన్ చక్రవర్తి (550 ర్యాంకు), తలియా హేమంత్ (593 ర్యాంకు), మన్నం సుజిత్ సంపత్ (805 ర్యాంకు)లను సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఏపీ ప్లానింగ్ శాఖ సెక్రటరీ విజయ్‌కుమార్ జీఎస్ఆర్‌కెఆర్, ఏపీ మైనారిటీ శాఖ సెక్రటరీ ఏఎండి ఇంతియాజ్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, ఏపీ సచివాలయం స్పెషల్ సెక్రటరీ కె.ఆదినారాయణ పాల్గొంటారని తెలిపారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు గోళ్ళ నారాయణరావు, పి.మురళీకృష్ణ, రాజు, కమల పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కుమ్మరివారివీధి నాల్గో లైన్‌కు చెందిన పులప పద్మజ గొల్లపాలెం గట్టు ప్రాంతానికి చెందిన జయరామ్‌ను ప్రేమించి 2012లో వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు సంతానం. జయరాజ్ మద్యం అలవాటు ఉండటంతో ప్రతి రోజు భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. ఇంటిని పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న భర్త, తనను పిల్లలను చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తల్లి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):తాతయ్య ఇంటి నుంచి బయలుదేరిన తన తల్లి కనిపించడం లేదంటూ కుమారుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కబేళా ప్రాంతానికి చెందిన కాకినాడ వెంకటలక్ష్మీ (41) గురువారం ఉదయం కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ సమీపంలో ఉండే తన తండ్రిని చూసేందుకు వెళ్లింది. సాయంత్రం అయినా తన తల్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో వెంకటలక్ష్మి కుమారుడు రవితేజ తాతయ్య ఇంటికి వచ్చి ఆరా తీశాడు. మధ్యాహ్నమే వెంకట లక్ష్మీ వచ్చి వెళ్లినట్లు చెప్పాడు. దీంతో తల్లి కనిపించడం లేదంటూ రవితేజ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

● ఎడారి ఓడ సందడి



ఎడారి ఓడ నగరంలో సందడి చేసింది. రాజస్తాన్ నుంచి వచ్చిన వలసదారులు నగరంలో ఉంటూ ఒంటెలను తిప్పుతున్నారు. ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు పశుగ్రాసం సేకరించి ఒంటెపై వేసి తీసుకొస్తున్న దృశ్యం భవానీపురంలో కన్పించింది. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com